# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.
- ఎన్నికల ప్రకటన వెలువడడంతో రాష్ట్రంలో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్ లు దాఖలు చేస్తున్నారు.
- ఎన్నికల నిబంధనల అతిక్రమణలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో అనేక బృందాలను మొహరించినట్టు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున తెలిపారు.
- రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వడ గాలులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

=====================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఉదయం తూర్పు గోదావరి జిల్లా ఎస్‌టీ రాజపురం నుండి బయలుదేరి, రంగంపేట, పెద్దాపురం బైపాస్, సామర్లకోట బైపాస్ మీదుగా ఉండూరు చేరుకున్నారు. ఇటీవల ఆయనపై దాడి జరగడంతో అధికారులు భద్రతా చర్యలను పటిష్టం చేశారు. ఆయన బస్సుయాత్రలో ప్రత్యేకంగా మొబైల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి, పోలీస్ శాఖ, ఐ పేక్ సంయుక్తంగా కమాండ్ సెంటర్ పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా ఆయన భద్రతను నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాకినాడలో జరిగిన మేమంతా సిద్ధం సభలో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డి ఈ రాత్రి గొడిచర్ల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో విశ్రాంతి తీసుకుంటారు.

=====================

ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజక వర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి ఆర్కే రోజా చిత్తూరు జిల్లా నగరిలో నామినేషన్ ను దాఖలు చేశారు. మాజీ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి కురుపాం నియోజక వర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ వేశారు. ఇక తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తరపున ఆయన సతీమణి నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లా కుప్పంలో నామినేషన్ దాఖలు చేసారు.

=====================

ఎన్నికల నేపధ్యంలో జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్టు విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున వ్యయ పరిశీలకుల బృందానికి తెలిపారు. ఈరోజు విశాఖలో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... 11 చోట్ల చెక్ పోస్టులు పెట్టామని, ఇప్పటి వరకు వస్తు, ధన రూపేణా 4 కోట్ల 92 లక్షల రూపాయల నగదును సీజ్ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 110 రకాల బృందాలు క్షేత్ర స్థాయిలో పని చేస్తూ... నగదు తరలింపు, మద్యం రవాణాపై నిఘా ఉంచుతున్నాయన్నారు. 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్ నుంచి సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని, అందులో భాగంగా 16 మంది నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. జిల్లాలో 502 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, వెయ్యి 457 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టేందుకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలియజేశారు.

=====================

రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఉరుములతో కూడిన జల్లులు కురవచ్చని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంలో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో, ఒకటి రెండు చోట్ల వడ గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

=====================

ఎన్నికల వ్యయ పరిశీలకులు నీనా నిగం సారథ్యంలోని బృందం ఈరోజు విశాఖలోని కంప్లైంట్ మానిటరింగ్ కేంద్రాలను సందర్శించింది. జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వివిధ మానటరింగ్ కమిటీ కేంద్రాల పని తీరుపట్ల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున, ఎంసీసీ నోడల్ అధికారి సీ.ఎం. సాయికాంత్ వర్మ ఆయా కేంద్రాల ద్వారా అందుతున్న సేవల వివరాలను పరిశీలకుల బృందానికి వివరించారు. నిరంతరాయంగా పనిచేసే వెబ్ కాస్టింగ్, ఎంసీఎంసీ, కంప్లైంట్ మానిటరింగ్ కేంద్రాలను బృందం పరిశీలించి, మానిటరింగ్ కేంద్రాల నుండి అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకుంది.

=====================

విశాఖపట్నం జిల్లాలోని అన్ని న్యాయ స్థానాలలో వచ్చే నెల 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలియజేసింది. జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్ కేసులతో పాటు పారిశ్రామిక వివాదాలు, రాజీ పడ దగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

=====================

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అధికారులకు సూచించారు. నర్సీపురంలో వైద్య సిబ్బంది చేపట్టిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ఆయన

ఈరోజు పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వచేసే కుండీలు, నిలిచిపోయిన మురుగు నీరు, పాడైన ప్లాస్టిక్, తదితర వస్తువులపై లార్వా చేరి, దోమలు వృద్ధి చెంది, తద్వారా అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ప్రజలకు వివరించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనిసూచించారు. అనంతరం ప్రిజం10 అమలు తీరుపై ఆరా తీసి, అడాప్షన్ అధికారులు పర్యవేక్షిస్తున్న గర్భిణీలు , బాలింతల వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు.

====================

విరామం

గుంటూరు జిల్లాలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు సృజన ఉత్సవ్ పేరిట పలు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన 30 మంది బాలబాలికలు పాల్గొని, ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం ఇంఛార్జి ప్రిన్సిపాల్ టి. ఎల్. ప్రసన్న ఆకాశవాణితో మాట్లాడుతూ... విద్యార్థుల్లోని సృజనాత్మకత ప్రతిభను వెలికి తీయడానికి కేంద్ర ప్రభుత్వం సృజన ఉత్సవ్ ను నిర్వహిస్తోందని తెలియజేశారు. ఈ పోటీల విజేతలకు గుజరాత్ లో జరగనున్న ప్రేరణ ఉత్సవ్ లో పాల్గొనే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశీలకులుగా వ్యవహరిస్తున్న కె. ఎం. ప్రతిష్ట మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు వివిధ రంగాల్లో సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం కలుగుతుందని వివరించారు.

(వాయిస్ 20 సెకన్లు)

====================

స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న 18వ వర్ధంతి కార్యక్రమం ఈరోజు కృష్ణా జిల్లా మచిలీపట్నం టిడిపి పార్లమెంటరీ కార్యాలయంలో జరిగింది. పార్లమెంట్ మాజీ సభ్యుడు కొనకళ్ల నారాయణ రావు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, తదితరులు గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... వల్లభాయ్ పటేల్ తర్వాత దేశంలో సర్దార్ గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. ఆయన ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటమని, బలహీన వర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి అని కొనియాడారు.

====================

రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పరీక్ష ఈ నెల 25వ తేదీన జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కో ఆర్డినేటర్ జే. ఎన్ . సంధ్యా భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7, 8 వ తరగతులకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే , కళాశాలలకు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. పాడేరు పట్టణంలో నిర్దేశించిన 3 కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

====================

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు సాలకట్ల వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి నాటికి పూర్తయ్యేలా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొంది. ఈ నెల 21న ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగి, అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేస్తారని వివరించింది. వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయ్యాక, స్వామి తిరిగి ఆలయానికి చేరుకుంటారని తెలియజేసింది. వసంతోత్సవం సందర్భంగా ఆలయంలో కొన్ని సేవలను రద్దు చేసినట్టు టిటిడి తెలిపింది.

=====================

విశాఖపట్టణం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున, 30వ తేదీ న మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ ఛైర్ పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన, జెడ్పీ సమావేశ మందిరంలో సమావేశం జరగనుందని, సభ్యులంతా హాజరు కావాలని ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఒక ప్రకటనలో సూచించారు.

=====================

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ పటేల్ సూచించారు. తిరుపతి నగరం అలిపిరి పోలీస్టేషన్ పరిధిలో ఈ ఉదయం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించాయి.

=====================

=====================